క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈఓ శశిధర్ గుప్తా

శివంపేట (నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్రాపూర్ లక్ష్మీనరసింహస్వామి జాతరకు హాజరు కావాలని ఎమ్మెల్యే సునీతా రెడ్డికి ఆలయ ఈఓ శశిధర్ గుప్తా ఆహ్వాన పత్రికను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేను హైదరాబాద్‌లో కలిసి ఈనెల 21 నుంచి మార్చి వరకు ప్రతీ ఆదివారం జరిగే స్వామివారి జాతరకు రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు. ఆహ్వాన పత్రిక అందజేసినవారిలో ప్రధాన అర్చకుడు ధనుంజయ శర్మ, సిబ్బంది నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ చందన

పాపన్నపేట(మెదక్): ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చందన సూచించారు. గురువారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఆధార్ కేంద్రం ఏర్పాటుతో సుమారు 36 పంచాయతీల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. వినియోగదారులు కేంద్రం సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గురుమూర్తిగౌడ్, ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు గౌస్, హెచ్ఎం మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి మల్టీ సీరియల్ లైట్ల బహూకరణ



మల్టీ సీరియల్ లైట్లను అందజేస్తున్న దాతలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి దాతలు గురువారం మల్టీ సీరియల్ లైట్లు బహూకరించారు. వీటిని ఆలయ గోపురానికి ఏర్పాటు చేసేందుకు ఆలయ ఈఓ శశిధర్‌గుప్తాకు హైదరాబాద్‌కు చెందిన టెకుమట్ల దుర్గాదాస్, గానసల నర్సింగరావు అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు ధనుంజయ్ శర్మ, సిబ్బంది నర్సింహారెడ్డి, విద్యాకర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలోని బాలికల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నీరుడి జనార్దన్ మృతి తీరని లోటని మండల నోడల్ అధికారి వెంకటేశం అన్నారు. గురువారం పాఠశాలలో కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు విఠల్‌నాయక్, రామకృష్ణాగౌడ్, మారుతి, కె.వి.రవీందర్, రాజేశ్వర్, ఉపాధ్యాయులు సంతోష్, సిద్దిరాములు, సత్యకుమార్, హన్మాండ్లు, దయానంద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కూచారం కేజీబీవీలో..

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం కేజీబీవీలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్ట్ భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కస్తూర్బా స్పెషల్ అధికారి కృష్ణతేజ గురువారం తెలిపారు. అభ్యర్థి కనీస విద్యార్హత 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. మనోహరాబాద్, తూప్రాన్ మండలాలకు చెందిన ఆసక్తి గల వారు ఈనెల 22వ తేదీ వరకు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 96664 94960, 95024 25759 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

కేజ్‌వీల్స్‌తో రోడ్లు ధ్వంసం

- రోడ్డు నిర్మించిన కొద్దికాలంలోనే దెబ్బతింటున్న వైనం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్న డీఎస్పీ



కేజ్‌వీల్స్ రాకపోకలతో ధ్వంసమైన దామరంచ బీటీ రోడ్డు

వెల్దుర్తి(తూప్రాన్): బీటీ, సీసీ రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు నడుపుతుంటంతో ధ్వంసమవుతున్నాయి. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం ఓ వైపు రూ.కోట్ల ప్రజాధనంతో రోడ్లు నిర్మిస్తుంటే నిబంధనలు పాటించని ట్రాక్టర్ యజమానుల వైఖరితో రహదారులు పాడవుతున్నాయి. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం వెరసి పదికాలాల పాటు పదిలంగా ఉండేలా నిర్మించిన ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రోడ్లు అనతి కాలంలోనే శిథిలావస్థకు చేరుతున్నాయి. రబీ సీజన్ ప్రారంభంకావడంతో చెరువులు, కుంటలతో పాటు బోర్‌మోటార్లు ఉన్న రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాలను వరినాట్లకు సిద్ధం చేయడానికి ట్రాక్టర్ యజమానులు కేజ్‌వీల్స్‌తో రోడ్లపై వెళ్తుండటంతో అవి దెబ్బతింటున్నాయి.

ఇవీ నిబంధనలు

వ్యవసాయ పనులకు వినియోగించే కేజ్‌వీల్స్‌ను ట్రాక్టర్ యజమాని వాటిని ట్రాలీలో కానీ మరే ఇతర వాహనంలో కానీ పొలానికి తీసుకుపోవాలి. పనులు పూర్తయిన తర్వాత మళ్లీ వాటిని వాహనంలో తీసుకెళ్లాలి. లేనిపక్షంలో కేజ్‌వీల్స్‌తో రోడ్లు దెబ్బతినకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలి. అయితే క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. ట్రాక్టర్‌కు ఇంటివద్దే కేజ్‌వీల్స్ బిగించుకొని ఇష్టారాజ్యంగా వెళ్తున్నారు. కేజ్‌వీల్స్ ట్రాక్టర్ల రాకపోకలతో రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయి.



రోడ్డుపై కేజ్‌వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్ (ఫైల్)

రోడ్లపై తిరిగితే కేసు నమోదు చేస్తాం



పొలం పనుల్లో ట్రాక్టర్ల వాడకం ఎక్కువగా ఉంటుంది. ట్రాక్టర్ నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. కేజ్‌వీల్స్‌తో రోడ్లపై తిరిగితే సహించేదిలేదు. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా తూప్రాన్ డివిజన్ పరిధిలో మట్టి, హల్దీవాగు నుండి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ విషయమై నిఘా పెంచాం. మొదటిసారి పట్టుబడితే వాల్టా చట్టం కింద, రెండు, మూడోసారి పట్టుబడితే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయడం జరుగుతుంది.

– యాదగిరిరెడ్డి, డీఎస్పీ, తూప్రాన్

ఆలయాల్లో స్వచ్ఛ తీర్థ అభియాన్



పెద్దశంకరంపేటలో మాట్లాడుతున్న శ్రీరామతీర్థ క్షేత్ర బాధ్యులు



మెదక్‌లోని ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో..

మెదక్: ఈనెల 22వ తేదీన అయోధ్యలోని రామజన్మ భూమిలో రాముడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న నేపథ్యంలో దేశంలోని అన్ని ఆలయాలను స్వచ్ఛ తీర్థ అభియాన్ పేరిట శుభ్రం చేస్తున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. గురువారం పట్టణంలోని గోల్కొండ వీధి ఎల్లమ్మ గుడి ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. మూడు రోజులపాటు ఆలయాలను శుభ్రం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సంగీత, పట్టణ ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

పెద్దశంకరంపేట(మెదక్): అయోధ్యలో శ్రీ రాముని పట్టాభిషేకం సందర్భంగా మండలంలోని ఆలయాలను శుభ్రం చేయాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర బాధ్యులు సీతారామారావు, జైహింద్‌రెడ్డి, సతీష్‌గౌడ్, మహంకాళి కృష్ణమూర్తి, రవివర్మ, శ్రావణ్, హరికిషన్ కోరారు. గురువారం సరస్వతి శిశుమందిర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేవాలయాలను పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేపట్టాలన్నారు.

మైనంపల్లిని కలిసిన సర్పంచ్‌లు

చిన్నశంకరంపేట(మెదక్): మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును చిన్నశంకరంపేట మండలంలోని సర్పంచ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం దూలపల్లిలోని మైనంపల్లి ఇంట్లో కలిసి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. మైనంపల్లిని కలిసినవారిలో చిన్నశంకరంపేట, రుద్రారం, టి.మాందాపూర్, వెంకట్రావుపల్లి, భాగిర్తిపల్లి గ్రామాల సర్పంచ్‌లు రాజిరెడ్డి, మంచాల లక్ష్మణ్, భిక్షపతి గౌడ్, దయానంద్, నర్సయ్య, చిన్నశంకరంపేట మండల కాంగ్రెస్ నాయకుడు ఆవుల గోపాల్‌రెడ్డి ఉన్నారు.

ప్రవేశాలకు గడువు పొడిగింపు

గజ్వేల్‌రూరల్: గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు గడువు పొడగించినట్లు టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్/జేసీ(బాలురు, వర్గల్) ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి గురువారం తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2024–25 విద్యాసంవత్సరంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల (ఎస్సీ, ఎస్టీ, బీసీ)లో 5వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 11న రాత పరీక్ష నిర్వహించి మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక ఉంటుందని, మరిన్ని వివరాలకు 180042545678 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నూతన ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్



మన్నన్

చిన్నశంకరంపేట(మెదక్): ఈనెల 20, 21వ తేదీలలో ఓటరు నమోదుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చిన్నశంకరంపేట తహసీల్దార్ ఎంఏ మన్నన్ గురువారం తెలిపారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంతోపాటు గ్రామాలలో బూత్ అధికారులు ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలలో అందుబాటులో ఉంటారన్నారు. ఇప్పటికీ ఓటరు జాబితాలో పేర్లులేనివారు, 18 ఏళ్లు నిండినవారు ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తునికి యువకుడికి డాక్టరేట్



ప్రశాంత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి విద్యార్థి డాక్టరేట్ సాధించాడు. గ్రామానికి చెందిన బండ దుర్గాగౌడ్, లక్ష్మి దంపతులకు ఇద్దరు కొడుకులు. చిన్న కొడుకు బండ ప్రశాంత్‌గౌడ్ చదువులో ప్రతిభ కనబర్చి ఉన్నత విద్య అభ్యసించాడు. తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తిచేసి సీఎస్ఐఆర్ నెట్ ఉత్తీర్ణత సాధించి వరంగల్ ఎన్ఐటీలో పీహెచ్‌డీ సీటు సాధించాడు. ప్రొఫెసర్ రాగసుధ ఆధ్వర్యంలో జూన్ 2019 నుంచి డిసెంబర్ 2023వరకు ‘నానో క్యాటలిస్ట్ డెవలప్‌మెంట్ ఇండస్ట్రియల్ అప్లికేషన్స్’పై వివిధ పరిశోధనలు చేశాడు. దీంతో వరంగల్ ఎన్ఐటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ప్రశాంత్ గౌడ్ తెలిపాడు. డాక్టరేట్ రావడంతో నల్లపోచమ్మదేవిని ప్రశాంత్‌గౌడ్ దర్శించుకున్నాడు. గ్రామ సర్పంచ్ సాయిలు, ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సాయాగౌడ్, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామానికి మంచి పేరుతేవడంతో ప్రత్యేకంగా అభినందించారు.

బ్యాంకింగ్ విధానంపై అవగాహన



బ్యాంక్ ఖాతాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం బ్యాంకింగ్ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేగుంట ఎస్‌బీఐ మేనేజర్ మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు బ్యాంకింగ్ గురించి తెలుసుకోవాలన్నారు. సేవింగ్ తదితర ఖాతాలను వివరించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా అమలవుతున్న సుకన్య సమృద్ధి యోజన, జీవన జ్యోతి బీమా యోజన వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నీరజ, ఉపాధ్యాయులు లక్ష్మణ్, వెంకటేశ్, రాథోడ్, చక్రధర్ శర్మ, శారద, ఈశ్వరయ్య, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- మృతుడు చౌదరిపల్లి సర్పంచ్ భర్త
- కేసు నమోదు చేసిన పోలీసులు



శంకర్‌గౌడ్ (ఫైల్)

తూప్రాన్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వర్గల్ మండలం చౌదరిపల్లి సర్పంచ్ భర్త బొడిగ శంకర్‌గౌడ్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వర్గల్ మండలం చౌదరిపల్లి సర్పంచ్ బొడిగె లలిత భర్త బొడిగ శంకర్‌గౌడ్(52) శుభకార్యం నిమిత్తం జనవరి 23వ తేదీన స్కూటీమీద కుమారుడితో కలిసి వెల్దుర్తి మండలం నెల్లూరుకు బయల్దేరాడు. వీరి వాహనాన్ని తూప్రాన్ వద్ద జాతీయ రహదారిపై నిజామాబాద్ వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శంకర్‌గౌడ్‌ను చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. గురువారం శంకర్‌గౌడ్ అంత్యక్రియలు జరిగాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాగు నీరు విడుదల చేయండి



మంత్రి కొండా సురేఖతో చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పూజల హరికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మల్లన్నసాగర్ నుంచి సాగు నీరును సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాలకు విడుదల చేయాలని దుబ్బాక ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట ఇంచార్జ్ పూజల హరికృష్ణ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖను కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. నాలుగు రోజుల్లో సాగునీరు విడుదల చేసే విధంగా కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

చిరుధాన్యాల సాగుతో ఉపయోగకరం

- డీడీఎస్ సూపర్‌వైజర్ బాలయ్య
- పాత పంటల జాతరకు ఘన స్వాగతం



ఎడ్లబండ్లకు స్వాగతం పలుకుతున్న మహిళా రైతులు

జహీరాబాద్: చిరుధాన్యాల సాగుతో అన్ని విధాలుగా ఉపయోగం ఉంటుందని డీడీఎస్ సూపర్‌వైజర్ బాలయ్య అన్నారు. మండలంలోని శేఖాపూర్ గ్రామానికి గురువారం పాతపంటల జాతర ఎడ్లబండ్లు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామ రైతులు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బాలయ్య మాట్లాడుతూ చిరుధాన్యాలను సాగు చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు పశువులకు మేత, భూమి సారవంతమవుతుందన్నారు. వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఈ పంటలు పండుతాయని తెలిపారు. ఎవరికైనా విత్తనాలు అవసరం ఉంటే అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ నర్సింహులు, డీడీఎస్ సభ్యులు విజయలక్ష్మి, మంజుల, వినయ్‌కుమార్, బాలయ్య, జనరల్ నర్సమ్మ, చుక్కమ్మ, అల్గోల్ నర్సమ్మ, చంద్రమ్మ, లక్ష్మమ్మ, పూలమ్మ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్‌లోని మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలో 5 తరగతి, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 2024 –25 విద్యా సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సంగమేశ్వర్ గురువారం తెలిపారు. ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు కోసం tmreis.telangana.cgg.gov.in ద్వారా ఆన్ లైన్‌లో లేదా మొబైల్ యాప్ లేదా నేరుగా పాఠశాల, కళాశాలలో సంప్రదించవచ్చని సూచించారు. అదేవిధంగా 6, 7, 8 తరగతిలో ఖాళీగా ఉన్న మైనార్టీ బ్యాక్‌లాగ్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జిగా కుమార్



నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి జమునగల్ల కుమార్‌ను నియమిస్తూ జిల్లా కమిటీ నియామక పత్రం అందజేసింది. ఇటీవల జరిగిన మెదక్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయనకు మండల ఇన్‌చార్జి పదవి అప్పగించారు. త్వరలో హలో మాదిగ చలో ఢిల్లీ కార్యక్రమానికి మాదిగలను చైతన్య పరిచేందుకు కృషి చేస్తానని నూతన ఇన్‌చార్జి తెలిపారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



అక్షింతలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాజేందర్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని శేరితండాలో గురువారం అయోధ్య శ్రీరామ మందిరం ప్రాణప్రతిష్ఠ అక్షింతలను పంపిణీ చేశారు. శేరితండాలోని శ్రీఆదిలక్ష్మి ఆశ్రమం పీఠాధిపతి చరణ్ మహారాజ్ ఆధ్వర్యంలో వెల్మకన్న సర్పంచ్ రాజేందర్ తండావాసులతో కలిసి ఇంటింటికి అక్షింతలు అందజేశారు.

‘మోడల్’లో ప్రవేశాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మోడల్ స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ అయినట్లు ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మలత తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ 2023–24లో 6వ తరగతి ప్రవేశాలతో పాటు 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిపోయిన సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు ఓసీ విద్యార్థులు రూ. 200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగులు రూ.125 ఫీజు చెల్లించాలన్నారు. ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

గురుకుల పాఠశాలలో..

హుస్నాబాద్: హుస్నాబాద్ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికిగాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గురువారం తెలిపారు. 5వ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో అన్నివర్గాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థుల ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్‌తో దరఖాస్తులను ఆన్‌లైన్‌లో గానీ, ప్రత్యక్షంగా పాఠశాలకు వచ్చి అందజేయొచ్చని తెలిపారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, పార్వతి అన్నారు. గురువారం మండలంలోని కొంతన్‌పల్లి, శభాష్‌పల్లి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివిధ శాఖల సిబ్బంది అవగాహన కల్పించారు. పీఎం జీవనజ్యోతి, సురక్ష బీమా, పంటల సాగులో అగ్రిగోన్ పిచికారీ, ఆయుష్మాన్ భారత్ పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సంకల్ప యాత్ర మండల ఇన్‌చార్జి అశోక్, వివిధ శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మల్లన్నసాగర్ బాధితులకు న్యాయం చేయాలి

గజ్వేల్‌రూరల్: మల్లన్నసాగర్ ప్రాజెక్టు ముంపు బాధితులకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూసేకరణ చేపట్టి ప్రాజెక్టును పూర్తి చేసినప్పటికీ... భూబాధితులకు ఇంతవరకు న్యాయం చేయలేదని ఆరోపించారు. బాధితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఇంటికి ఇళ్లు, బడి, గుడి, ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకుంటామని మాయమాటలు చెప్పి వారిని మోసం చేసిందని మండిపడ్డారు. న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించిన వారికి మాత్రమే పరిహారం లభించగా.. అధికారులు, ప్రజాప్రతినిధుల మాటలు నమ్మిన వారు మోసపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రణాళికతోనే పంచాయతీల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సమ్మిరెడ్డి

దుబ్బాక: గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను గ్రామ సభల తీర్మానం మేరకు వినియోగించాలని గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల శిక్షణాధికారి, ఎంపీడీఓ సమ్మిరెడ్డి అన్నారు. గురువారం దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో దుబ్బాక, మిరుదొడ్డి, దౌల్తాబాద్, తొగుట మండలాల పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024– 25 ఆర్థిక సంవత్సరానికి గానూ ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేయడానికి గ్రామస్థాయి నుంచి ప్రణాళికలు తయారు చేసుకుని ఆన్‌లైన్ చేయాలన్నారు. పంచాయతీల తీర్మానాలు, నిధుల వ్యయం వివరాలను ఈ– గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు భాస్కరశర్మ, రాజేష్, శ్రీధర్, రాజిరెడ్డి, ఎంపీఓలు నరేందర్‌రెడ్డి, గఫూర్‌ఖాద్రీ, జహీరొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

టీచరమ్మ ఔదార్యం



పిల్లల బంధువులతో ఉపాధ్యాయురాలు సౌజన్య

గజ్వేల్: గజ్వేల్ మండలం కొల్గూర్‌లో తల్లిదండ్రుల మరణంతో అనాథలైన ఐదేళ్లలోపు చిన్నారులు కావ్యశ్రీ, శ్రీవాణి, రిషిత్‌కుమార్‌కు అహ్మదీపూర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సౌజన్య అండగా నిలిచారు. వీఆర్ఏ విధుల నిర్వహిస్తున్న వారి తల్లి నీరుడి కవిత ఇటీవల మృతిచెందగా, తండ్రి భాస్కర్ రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో పిల్లల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. విషయం తెలుసుకున్న సౌజన్య తనతో పాటు మిత్రుల సహకారంతో రూ. 14 వేల ఆర్థిక సాయాన్ని గురువారం పిల్లల బంధువులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొడుగు జ్యోతి, వార్డు మెంబర్లు బాలకిషన్, మైసయ్య పాల్గొన్నారు.